క్లుప్తంగా

ఆలయాల హుండీ ఆదాయం లెక్కింపు



బైటిపేట ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైటిపేట ఆంజనేయస్వామి కోదండ రామాలయం, మూలమఠం వద్ద ఉన్న భీమలింగేశ్వర స్వామి ఆలయాల హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం గురువారం కోటపాడు దేవస్థానం ఈఓ వేణునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. బైటిపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో సంవత్సర హుండీ ఆదాయం రూ.50,472 లభించిందని, గత ఏడాది కంటే రూ.1,318 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. మూలమఠం భీమలింగేశ్వరస్వామి ఆలయ హుండీ సంవత్సర ఆదాయం రూ.80,716 సమకూరిందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ సన్నల వెంకటరెడ్డి, చెన్నా వెంకటేశ్వర్లు, ఈఓ ఆంజనేయశర్మ, ధర్మకర్తలు సుబ్రహ్మణ్యం, లక్ష్మిగౌరి, లక్ష్మిదేవి, శ్రీతిరుమల బాలాజీ సేవా సమితి, వాసవీ కన్యకాపరమేశ్వరి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



డీఎంఅండ్‌హెచ్‌ఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలోని ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి రమణకుమారి కోరారు. ఆశా వర్కర్లకు పని భారం తగ్గించాలని చనిపోయిన ఆశాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరుతూ గురువారం యూనియన్ ఆధ్వర్యంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. శివమ్మ, శిరోమణి, మద్దమ్మ పాల్గొన్నారు.

గోస్పాడు: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఆశా వర్కర్స్ జిల్లా కార్యదర్శి రమణకుమారి, శివలక్ష్మి కోరారు. మండల కేంద్రంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డాక్టర్ గోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. వర్కర్లు శారదా, సుభద్ర, వెంకటలక్ష్మమ్మ, హుసేనమ్మ, సువర్ణ పాల్గొన్నారు.

పంట నమోదు జాబితాలపై సామాజిక తనిఖీ



పంట నమోదు జాబితాను చదువుతున్న డీఏఓ మోహన్‌రావు

శిరివెళ్ల: రబీ సీజన్ పంట నమోదు జాబితాలపై సామాజిక తనిఖీ జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. గురువారం యర్రగుంట్ల ఆర్‌బీకేను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతు ఏ సర్వే నంబర్‌లో ఏ పంట, ఎన్ని ఎకరాలు వేశారు అన్నది ఆర్‌బీకేలో పంట నమోదు జాబితాలో పేర్కొని ప్రదర్శనకు ఉంచామన్నారు. వీటిపై గ్రామ సభలు మొదలయ్యాయని, రైతులు జాబితాను చూసుకొని ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 17వ తేదీలోపు ఫిర్యాదు చేయవచ్చన్నారు. వాటిని పరిశీలించి తది జాబితాలు రూపొందిస్తామన్నారు. జొన్న సాగుచేసిన రైతులు ధాన్యం అమ్ముకొనేందుకు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఏఓ సుధాకర్, ఉప సర్పంచు సత్తార్ ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు



గాయపడిన సుజేంద్ర

ఆళ్లగడ్డ: పట్టణంలోని కోర్టు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సుజేంద్ర అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణంలోని కొత్త మసీదు వీధికి చెందిన సుజేంద్ర శిల్ప కళాక్షేత్రంలో శిల్పాలు తయారు చేసే పనికి వెళ్తుండేవాడు. గురువారం ఇంటి నుంచి శిల్ప కళాక్షేత్రానికి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా కోర్టు సమీపంలో నంద్యాల రోడ్డు క్రాస్ చేస్తుండగా నంద్యాల వైపు నుంచి వస్తున్న మినీ లారీ ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన సుజేంద్రను స్థానిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో 108 వాహనంలో నంద్యాల వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు.

నేడు మండల మీట్

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఆదేశించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

సేవల నిలయం..సచివాలయం

నాలుగేళ్ల క్రితం వరకు ఏ చిన్న పని అయినా మండల, నియోజకవర్గ కేంద్రాలకు గ్రామీణులు పరుగులు తీయాల్సి వచ్చేది. ఆ రోజు పని కాకపోతే మరో రోజు.. ఇలా.. రోజుల తరబడి తిరిగినా సమస్యకు పరిష్కారం లభించేది కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహాత్ముడి ఆశయ సాధనలో భాగంగా పాలనను ప్రజలకు చేరువ చేయాలని గ్రామ సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం పల్లెల్లోనే కార్యాలయాలను నిర్మించి సిబ్బందిని నియమించి దాదాపు 536 రకాల సేవలను అందిస్తోంది. 15 నిమిషాల నుంచి 72 గంటల్లోనే ప్రస్తావించిన సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. గ్రామం దాటి బటయకు వెళ్లాల్సిన పనిలేకుండా సేవలు అందుబాటులోకి తేవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- గ్రామ సచివాలయాల్లో 536 రకాల సేవలు అందుబాటులో
- 15 నిమిషాల నుంచి 72 గంటల్లో సమస్యకు పరిష్కారం
- ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యం ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- ఆకస్మిక తనిఖీలు చేస్తున్న ప్రజాప్రతినిధులు
- ప్రజలకు గ్రామంలోనే మెరుగైన సేవలు



జి.జంబులదిన్నెలోని సచివాలయం



పేరాయిపల్లెలో దరఖాస్తులను అప్‌లోడ్ చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్

ఆళ్లగడ్డ: మారుమూల పల్లెలో సైతం ప్రస్తుతం ప్రభుత్వ సేవలు సక్రమంగా, వేగంగా అందుతున్నాయి. గ్రామ/ వార్డు సచివాలయాల్లో 470 నుంచి 536 సేవలు ప్రస్తుతం సచివాలయల్లో అందుబాటులోకి వచ్చాయి. ఏయే సేవలకు ఎన్ని గంటలు, ఎన్ని రోజుల్లో అందించాలనే అంశంపై సర్వీస్ చార్ట్ సిద్ధం చేశారు. అత్యధిక సేవలు 72 గంటల్లోనే అందేలా రూపొందించారు. 11 ప్రభుత్వ శాఖలకు చెందిన 536 సేవలను ప్రజలకు అందించాలనేది సచివాలయాల ఉద్దేశం.

15 నిమిషాల్లో అందే సేవలు..

సచివాలయానికి వచ్చిన 15 నిమిషాల్లోనే కొన్ని సేవలు పొందవచ్చు. 1బీ, అడంగల్, ఆధార్, రేషన్ కార్డు ప్రింట్, టైటిల్ డీడ్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ సర్టిఫికెట్ కాపీ, విద్యుత్ కనెక్షన్, కేటగిరి మార్పు వంటివి పావుగంటలో పొందవచ్చు. ఇలా 47 సేవలు అప్పటికప్పుడు అందిస్తున్నారు. 148 సేవలు మాత్రం మూడు రోజుల్లో (72 గంటల్లో) పరిష్కరిస్తారు. మిగిలిన వాటికి మూడు రోజుల అనంతరం ఒక్కో సేవకు నిర్ణీత వ్యవధి ఉంది. ఈ సేవలకు ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేశారు.

అన్ని సౌకర్యాలతో సిద్ధం..

ప్రతి సచివాలయలో కంప్యూటర్, ఇంటర్నెట్, సదుపాయం, బల్లలు, కుర్చీలు, మొబైల్స్ అందించారు. దీంతో ప్రింట్ తీసిన తర్వాత కార్డులను అందిస్తారు. వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు ఇంటి వద్దకే చేర్చేందుకు వలంటీర్లకు మొబైల్స్ ఫోన్లు, సిమ్‌లను ఇప్పటికే పంపిణీ చేశారు.

మండలాల వారీగా గ్రామ సచివాలయాలు	
మండలం	సచివాలయాలు
ఆళ్లగడ్డ	12
చాగలమర్రి	17
దొర్నిపాడు	09
రుద్రవరం	16
శిరివెళ్ల	16
ఉయ్యాలవాడ	11
మొత్తం	81

రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు

చాలా రోజులుగా రేషన్ కార్డుల్లో కొత్తవారిని చేర్చడం వంటి సమస్యలు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కొత్తవారిని చేర్చేందుకు ఆప్షన్ రావడంతో సమస్యలు పరిష్కారమవుతున్నాయి. అలాగే హౌస్‌హోల్డ్ మ్యాప్‌లో కూడా మార్పులు, చేర్పులకు అవకాశం రావడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పాయి.

పూర్తి స్థాయిలో అందుబాటులోనున్న సేవలు..

క్యాస్ట్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్స్, ఆధార్ ఈకేవైసీ, ఇన్‌కం, 1బీ, అడంగళ్, ఎఫ్ఎంబీ, పట్టాదారు పాస్‌బుక్, ఫ్యామిలి మెంబర్ సర్టిఫికెట్, సదరం స్లాట్ బుకింగ్, తిరుపతి మరియు ముఖ్యమైన దేవాలయాల రూంల బుకింగ్, కొత్త రైస్‌కార్డు యాడింగ్, డెలిటింగ్, బర్త్, డెత్ సర్టిఫికెట్స్ సేవలు అందుతున్నాయి. అలాగే ఈసీ, డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్ సర్వీసులు అందుతున్నాయి. ప్రస్తుతం రూ. 40కే 1బీ, అడంగళ్, రూ.50కే కాస్ట్, ఇన్‌కం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లుకు ఇస్తున్నారు.

మండలకేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేదు



మా ఊర్లోనే అన్నిరకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. గతంలో మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. అయినా పనులు కాకపోతే తిరికి ఇంటికి వచ్చి మరుసటి రోజూ వెళ్లే వాళ్లం. ప్రస్తుతం ఆర్ఓఆర్, అడంగళ్ వంటి పత్రాలు వలంటీర్లు ఇంటివద్దకు వచ్చి ఇచ్చిపోతున్నారు.

–ప్రతాప్‌రెడ్డి, ఇంజేడు

ఒక్కరోజులోనే మా పిల్లలను రేషన్ కార్డులో ఎక్కించారు



ప్రస్తుతం మా ఇద్దరు పిల్లలను రేషన్‌కార్డులో వలంటీర్ ఎక్కించి నూతన కార్డు తెచ్చిఇచ్చారు. ప్రస్తుతం మాకుటుంబానికి 20 కిలోల బియ్యం ఇవ్వడంతో పాటు కార్డులో పేర్లు నమోదు కావడంతో అమ్మఒడి తదితర పథకాలకు అడ్డంకులు తొలగాయి.– స్వర్ణలత, దబ్ల్యూ గోవిందిన్నె

సచివాలయాల్లో మెరుగైన సేవలు



సచివాలయల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం అన్ని రకాల సేవలు గ్రామ సచివాలయాల్లోనే ఉన్నాయి. ప్రజలు ఇబ్బందులు పడకుండా వలంటీర్ల సాయంతో అన్ని పనులు మీ ఊళ్లోనే చేసుకోవచ్చు. ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అందజేస్తారు. ఒక్క రూపాయి కూడా అదనంగా తీసుకోరు. రైల్వే టికెట్స్ కూడా బుకింగ్ చేసుకోవచ్చు.

– నాగఅనసూయ, ఎంపీడీఓ, దొర్నిపాడు

నీట్‌లో మెరిసిన రైతు బిడ్డ



డాక్టర్ వెంకట అరవింద్ కృష్ణకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన బబ్బూరి రవిబాబు, రాజేశ్వరి దంపతుల కుమారుడు డాక్టర్ బబ్బూరి వెంకట అరవింద్ కృష్ణ నీట్‌లో 552 మార్కులతో 7,870 ఆలిండియా ర్యాంక్ సాధించి పీజీలో సీటు పొందాడు. ఎంబీబీఎస్‌ను తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురంలో పూర్తి చేసిన వెంటనే కోచింగ్ లేకుండా మొదటి ప్రయత్నంలోనే పీజీ సాధించడంతో అభినందనలు వెల్లువెత్తాయి. గ్రామ ఉప సర్పంచ్ బబ్బూరి లక్ష్మి శిరీష, మాజీ సొసైటీ డైరెక్టర్ బబ్బూరి వెంకటస్వామి ఆయనకు అభినందనలు తెలిపారు.అరవింద్ కృష్ణ మాట్లాడుతూ జగనల్ మెడిసిన్‌లో ఎండీ చేయాలన్నది లక్ష్యమని, అలాగే పేదలకు సేవ చేయాలని తన ధ్యేయంగా చెప్పారు.

యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోండి

దొర్నిపాడు: కస్టమ్ హైరింగ్ సెంటర్స్(సీహెచ్‌సీ) గ్రూపులకు ప్రభుత్వం అందిజేస్తున్న యంత్ర పరికరాలను గ్రూపు సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ సూచించారు. గురువారం క్రిష్టిపాడు గ్రామంలోని సీహెచ్‌సీ గ్రూపునకు మంజూరైన ట్రాక్టర్‌ను కేడీసీసీ బ్యాంకు అధికారులు, ఏఓలు పరిశీలించారు. ట్రాక్టర్ ధర రూ.8,64,000 ఉంటుందని, ఇందులో బ్యాంకు 50 శాతం రుణం అందజేస్తుందని, గ్రూపు సభ్యులు 50 శాతం నగదు చెల్లిస్తే ట్రాక్టర్ వస్తుందన్నారు. తర్వాత నెల రోజులకు రైతులు కట్టిన 50 శాతంలో ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుందని చెప్పారు. ట్రాక్టర్‌తో పాటు వ్యవసాయ యంత్రపరికరాలు కూడా అందజేస్తామని, మండలంలోని సీహెచ్‌సీ గ్రూపు సభ్యులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ రంగారెడ్డి పాల్గొన్నారు.

వడగండ్ల వాన



దొర్నిపాడు: మండలంలో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఎన్నడూ లేని విధంగా గంట పాటు వడగండ్లు కురవడంతో స్థానికులు అరచేతిలో పట్టుకొని ఆనందానికి లోనయ్యారు, ముఖ్యంగా అకాల వర్షంతో కళ్లాల్లో ఆరబెట్టుకున్న మిరప పంట తడిసి ముద్దకావడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

క్రీడలకు పెద్ద పీట



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్మన్

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు పెద్ద పీట వేశారని మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 18, 19వ తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి 33వ సీనియర్ విభాగం పురుషులు, స్త్రీల సెపక్‌తక్రా ఛాంపియన్ షిప్ ఎంపిక పోటీల బ్రోచర్‌ను గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సెపక్‌తక్రా ఉమ్మడి జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ టోర్నమెంట్ కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్రీడలు పట్టణంలోని జరగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సెపక్‌తక్రా అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ శంకర్‌రెడ్డి, కౌన్సిలర్లు హమీద్, చిన్నరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీను, బ్రహ్మయ్య, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

ఈ - క్రాప్ నమోదు సరిచూసుకోండి

ఆళ్లగడ్డ: రబీ పంట కాలానికి సంబంధించి ఈ - క్రాప్ నమోదు చేసుకున్న రైతులు మరోసారి సరిచూసుకోవాలని చాగలమర్రి మండల వ్యవసాయాధికారి రంగనేతాజీ తెలిపారు. మండలంలోని చిన్నబోధనం ఆర్బీకేను గురువారం తనిఖీ చేశారు. సామాజిక తనిఖీలో భాగంగా ఉంచిన ఈ - క్రాప్ నమోదు చేసుకున్న రైతుల జాబితాను పరిశీలించారు. జాబితాలో ఏమైన తప్పులు, సవరణలు ఉంటే 17వ తేదీ సాయంత్రం వరకు సరిచేసుకునే అవకాశం ఉందని చెప్పారు.

వేలంతో రూ.6.16 లక్షల ఆదాయం

బొమ్మలసత్రం: నంద్యాల సబ్‌డివిజన్ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు అడిషనల్ ఎస్పీ రమణ ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయ సమీపంలో గురువారం వేలం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 30 వాహనాలకు వేలం వేయగా 40 మంది పాల్గొన్నారని మొత్తం రూ.6.16 లక్షల ఆదాయం పోలీస్‌శాఖకు సమకూరిందన్నారు. డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐలు నరసింహులు, రవీంద్ర, ఎస్ఐలు నాగార్జున, సుధాకర్ ఉన్నారు.

బకాయిలు చెల్లించాలి

నంద్యాల(వ్యవసాయం): ఆర్టీసీ ఉద్యోగులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీపీటీడీ జోనల్ నాయకులు దేవసహాయం, శివారెడ్డి కోరారు. ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం గ్యారేజీ ఆవరణలో ఆర్టీసీ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు గత కొన్నేళ్లుగా అరియర్స్, పెన్షన్లు, ఇతర సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ రావు, డీఎస్ఎస్ రాయుడు, కొండారెడ్డి, మూర్తి, డిపో గ్యారేజీ సెక్రటరీ మద్దిలేటి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నంద్యాల(అర్బన్): అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకై ఈనెల 20న చేపడుతున్న చలో విజయవాడ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు కోరారు. స్థానిక నరసింహయ్య భవన్‌లో యూనియన్ నంద్యాల జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. నాయకురాళ్లు, సునితమ్మ, లలితమ్మ, నిరమ్మలమ్మ, వసంతమ్మ, వెంకటమ్మ, మరియమ్మ పాల్గొన్నారు.

సిబ్బంది కుటుంబాలకు అండగా నిలుస్తాం



అల్లాబకాష్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: మృతిచెందిన పోలీస్ కుటుంబాలకు తామంతా అండగా నిలుస్తామని, వారికి ఎప్పుడు ఏ అవసరమైనా అందుబాటులో ఉంటామని జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్ అల్లాబకాష్ కుటుంబానికి ఎస్పీ రూ.1.75 లక్షల చెక్కు గురువారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో జనవరి నెలలో అల్లాబకాష్ మృతిచెందాడన్నారు. ఆయన కుటుంబానికి ఫ్లాగ్ ఫండ్ కింద రూ. 25 వేలు, విడో ఫండ్ కింద రూ. 50 వేలు, ఉమ్మడి జిల్లా ఏఆర్ పోలీసుల సహకారంతో రూ. లక్ష మొత్తం రూ.1.75 లక్షలను ఆయన సతీమణి జయనాబీకి అందజేశామని చెప్పారు. అడిషనల్ ఎస్పీ రమణ, డీపీఓ ఏఓ నిజాముద్దీన్, సూపరింటెండెంట్ ఖాదర్‌వలి, ఆర్ఐ సుధాకర్, సోమశేఖర్ పాల్గొన్నారు.

వడివడిగా శ్రీగిరి వైపు అడుగులు



కావడి మోస్తూ, చెక్కకాళ్లపై ముందుకు సాగుతున్న దృశ్యం



స్వామివారిని పల్లకీలో శ్రీశైలానికి తీసుకెళ్తున్న భక్తులు

జూపాడుబంగ్లా: శ్రీశైల భ్రమరాంబికామాత పుట్టింటి వారిగా పేర్కొనే కన్నడిగులు స్వామి, అమ్మవార్లపై ఉన్న భక్తితో మండుటెండలను సైతం లెక్కచేయక వందల కిలోమీటర్లు కాలినడకన శ్రీశైలం వెళ్తున్నారు. ఉగాది వేడుకలను పురస్కరించుకొని కర్ణాటక, మహారాష్ట్ర, కొల్హాపూర్, ధార్వాడ్ తదితర ప్రాంతాల నుంచి వందల కిలోమీటర్లు కాలినడక మండుటెండల్లో అమ్మవారికి పసుపు, కుంకుమ తీసుకొని వడివడిగా ముందుకు సాగుతున్నారు. చెట్ల నీడన సేద తీరి శ్రీశైలం వైపు సాగిపోతున్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): స్థానిక ప్రభుత్వాసుపత్రిలో తొలగించిన శానిటేషన్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే వర్కర్లతో కలిసి ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలంటూ శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆసుపత్రి ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వర్కర్లు సుశీలమ్మ, రమణమ్మ, నాగేంద్రమ్మ, సావిత్రి, రాణి పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి ఏకాంతసేవ పూజలు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు గురువారం రాత్రి ఏకాంతసేవా పూజలు నిర్వహించారు. వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను పుష్పమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం అలంకార హారతులు శాస్త్రోక్తంగా చేపట్టారు. స్థానిక యాగశాలలో విశేషపూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

98 క్వాలిఫైడ్స్‌కు ఉద్యోగాలివ్వడంపై హర్షం

నంద్యాల(అర్బన్): ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకం చేస్తూ జీవో నెం .27 విడుదల చేయడం హర్షనీయమని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నంద్యాల జిల్లా కన్వీనర్ భాస్కర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఈ ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 4,534 మంది క్వాలిఫైడ్స్‌ను ఉపాధ్యాయులుగా కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించనున్నారన్నారు. నెలాఖరులోపు అభ్యర్థులకు నియామక పత్రాలు వస్తాయని ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి తెలిపారని చెప్పారు. నాయకులు రవికుమార్, పిచ్చిరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి మూలమాలవేస్తున్న ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి.



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీఈఓ తదితరులు



రుద్రవరం మోడల్‌స్కూల్‌లో పొట్టి శ్రీరాములు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

నంద్యాల(సిటీ): ఆంధ్రరాష్ట్ర ఆవిర్భావానికి కృషి చేసిన శ్రీ పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని డీఈఓ అనురాధ పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధనకు ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాముల ఆంధ్రుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ గోపాల్, డోన్ ఉపవిద్యాశాఖ అధికారి క్రిష్టఫర్, సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, డిస్ట్రిక్ట్ ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, హెచ్ఎం ఆదాంబాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : ఆంధ్ర రాష్ట్రానికి పొట్టి శ్రీరాములు చేసిన సేవలు చిరస్మరణీయమని పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా మండలంలోని తుడుమలదిన్నె సచివాలయంలో అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిజిటల్ అసిస్టెంటు మౌళాలి, సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరం:అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం ఆయన చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయం, త్యాగం వృథా కాకూడదని ప్రతి ఒక్కరూ ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

బొమ్మలసత్రం: ఆంధ్రరాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణ త్యాగం చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయ ఆవరణలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సాధనకు గాంధీమార్గంలో నడిచి ప్రజలను చైతన్యపరిచిన అమరజీవి నేటితరానికి స్ఫూర్తి అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణ, ఏఆర్ డీఎస్పీ సుంకురయ్య, ఆర్ఐ సుధాకర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల(వ్యవసాయం)/(అర్బన్): అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు 123వ జయంతిని ఉమ్మడి కర్నూలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక సంజీవనగర్ గేటు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సంఘం నాయకులు బింగుమల్ల శ్యాంసుందర్‌గుప్త, కండే శ్యాంసుందర్‌లాల్, నాగరాజులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగ ఫలితమే ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని, ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. నాయకులు, భవనాశి వాసు, సముద్రాల కుమార్, సుబ్బారావు, అనిల్, రామకృష్ణ, బాల వీరయ్య, వెంకటేశ్వర్లు, సుబ్బారావు పాల్గొన్నారు. అలాగే అయ్యలూరు ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.